ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా

- అక్రమరవాణాకు అడ్డాగా కాసరబాద రీచ్..
- నిబంధనలకు తూట్లు
- తరలుతున్న ప్రకృతి సంపద
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



కాసరబాద సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో అక్రమార్కులు డంప్ చేసిన ఇసుక

చందర్లపాడు(నందిగామటౌన్): ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు సిరుల పంటగా మారింది. కూటమి నేతల ఆశీస్సులతో నిత్యం వందలాది లారీల ద్వారా ఇసుకను రాష్ట్రాలను దాటిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుడు ఓ ట్రాక్టర్ ఇసుక తోలుకుంటే నిబంధనలు గుర్తుకు వచ్చి ఆగమేఘాలపై దాడులు చేసి కేసులు నమోదు చేసే అధికారులు, అధికార పార్టీ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగుతున్న ఈ ఇసుక అక్రమరవాణాను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా నెలకొన్నాయి. ముఖ్యంగా చందర్లపాడు మండలంలోని కాసరబాద ఇసుక రీచ్ అక్రమార్కులకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇష్టారీతిన ఇసుక అక్రమరవాణా చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.



కాసరబాద డంప్‌ల వద్ద నుంచి లారీలో తరలివెళ్తున్న ఇసుక

పగలు ట్రాక్టర్లు..రాత్రికి లారీలు..

ప్రభుత్వం ట్రాక్టర్‌ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లే వెసులుబాటు కల్పించడంతో పగటి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ చందర్లపాడు, నందిగామ మండలాల్లోని గ్రామాల పరిధిలో ఉన్న నిర్మానుష్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో యంత్రాల సహాయంతో ఆ ఇసుకను లారీలకు లోడ్ చేసి తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ అక్రమార్కులు రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఒక్కో లారీలో 30 టన్నులకుపైగా లోడుతో నిత్యం 200 నుంచి 300 లారీల ఇసుకను అక్రమార్కులు రాష్ట్రం దాటిస్తున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రోన్‌లకు కనిపించడం లేదా?..

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని శాస్త్ర సాంకేతిక టెక్నాలజీని వినియోగించి డ్రోన్‌ల సహాయంతో ఇసుక నిల్వలను గుర్తిస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పుకోవడం మినహా, అక్రమార్కులపై తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. వారు ఆదివారం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిల్వ చేసిన ఇసుక డంప్‌లు అధికారులు వినియోగిస్తున్న డ్రోన్‌లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలలో ఇసుక తరలుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే ఇసుక రీచ్‌ల వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని ఆపార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు కోట సత్యం, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకి రామయ్య, కొండా కృష్ణారెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న ఇసుక అక్రమరవాణాదారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కాసరబాద ఇసుకకు మంచి డిమాండ్..

నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లున్నప్పటికీ కాసరబాద ఇసుక నాణ్యతతో కూడిన ఇసుక కావటంతో మంచి డిమాండ్ ఉంది. దీంతో కూటమి నేతల చల్లని ఆశీస్సులతో కాసరబాద ఇసుక రీచ్‌ను అక్రమార్కులు తమ అడ్డాగా మార్చుకుని నిత్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈ ఇసుక లారీల రాకపోకలతో అర్ధరాత్రి సమయంలో గ్రామీణ ప్రాంత రహదారులపై ప్రాణాలు అరచేత పట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తుందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. లారీ డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతున్నారని ఇదేమని అడిగితే దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఇసుక పుణ్యమాని పచ్చని పంటపొలాలు సైతం నాశనమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాల నివారణపై అవగాహన



వత్సవాయి: సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.ఉమామహేశ్వరరావు సూచించారు. మండల కేంద్రం వత్సవాయిలో సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు జరిగే తీరును వివరించారు. కేవైసీ పేరుతో వచ్చే ఫోన్లకు స్పందించవద్దన్నారు. బ్యాంకు ఖాతాల కేవైసీ కోసం బ్యాంకు సిబ్బంది ఫోన్‌చేయరనే విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ఫోన్లకు వచ్చే ఓటీపీ సమాచారాన్ని ఇతరులతో పంచుకోకుండా ఉండటం ద్వారా సైబర్ నేరగాళ్ల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. సర్వే పేరుతో ఇళ్ల వద్దకు వచ్చేవారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వారు ప్రభుత్వ ఉద్యోగులా? లేక నకిలీ వ్యక్తులా అనే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చండీదేవిగా భ్రమరాంబ అమ్మవారు దర్శనం




వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ అమ్మవారు ఆదివారం శ్రీ చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీలోని పురాతన ఆలయాల్లో ఒకటైన పాత శివాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్షత్రదీక్షా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా అమ్మవారు ఆదివారం చండీదేవిగా ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. విశేష అలంకారంలోని అమ్మవారికి ఖడ్గమాల, త్రిశత, కుంకుమార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా ఆలయంలో కొలువైన స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, పంచహారతులు, రాత్రి పల్లకీసేవ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

మృతుడికి నివాళి



బలుసుపాడు(జగ్గయ్యపేటఅర్బన్): గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఉప్పుతోళ్ల భూషయ్య కుమారుడు చందు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు బలుసుపాడు వెళ్లి చందు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. భూషయ్యను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.తన్నీరు వెంట గ్రామ సర్పంచ్ యడ్లపల్లి సూరిబాబు, స్థానిక నాయకులు ఉన్నారు.

పండ్లతో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ



పెనుగంచిప్రోలు(వత్సవాయి): కార్తికమాస ప్రత్యేక అలంకరణల్లో భాగంగా పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారిని ఆదివారం పలురకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్తికమాసం, సెలవుదినం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



‘తన్నీరు’ను కలిసిన నాయకులు



తన్నీరు నాగేశ్వరరావును కలిసిన గౌరవరం, పోచంపల్లి నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావును మండలానికి చెందిన గౌరవరం, పోచంపల్లి గ్రామాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కోదాడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం, పోచంపల్లి గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తన్నీరు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ కార్యక్రమాల గురించి మాట్లాడారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని త్వరలో భారీఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి అందరికీ ఆహ్వానాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో పట్టణంతోపాటు గౌరవరం, పోచంపల్లి నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

టీచర్లకు మంచి సేవలు అందించాలి

జగ్గయ్యపేటఅర్బన్: టీచర్స్ కోపరేటివ్ సొసైటీ నూతన పాలకవర్గం నిజాయితీగా పనిచేసి సంఘ సభ్యులకు మంచి సేవలను అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక కోదాడ రోడ్‌లోని టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవన్‌లో ఆదివారం సొసైటీ పాలకవర్గ అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య అధ్యక్షతన జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల పరిధిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ స్కూల్స్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మహాసభ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ సొసైటీ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. సొసైటీ సభ్యులకు రుణాల కోసం కేడీసీసీబీ మంజూరు చేసిన రూ.47లక్షల చెక్కును సొసైటీ పాలకవర్గ సభ్యులకు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ సొసైటీ నుంచి లోన్లు తీసుకున్న సంఘ సభ్యులు సకాలంలో వాయిదాలను చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సొసైటీ సెక్రటరీ ఆజ్మీరు శ్రీను మాట్లాడుతూ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 17మంది సభ్యులకు రుణ మంజూరు చెక్‌లు పంపిణీ చేశారు. సభ్యులకు డివిడెంట్ అందజేశారు. అనంతరం ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జెడ్పీ బాలుర హైస్కూల్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తాతయ్య చేతుల మీదుగా సత్కరించారు. సొసైటీ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేడీసీసీ మంజూరు చేసిన చెక్కును పాలకవర్గానికి అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలి



నందిగామటౌన్: స్వామినాదన్ రైతు కమిషన్ సిఫార్సుల మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి కనీస మద్దతు ధరను ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు మహిళలు, ప్రజా సంఘాల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న నందిగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కేరళలో మాదిరి రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి అన్ని రాష్ట్రాలలో ఆమోదించాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సయ్యద్ ఖాశీం, బొడ్డు రాము, ఏసోబు, దారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌కు ఎక్స్ రే జాతీయ కవితా పురస్కారం

తిరువూరు: ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ఎక్స్ రే సాహితీ సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన వచన కవితా పోటీల్లో మా ఊరి గొడుగై కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ఈ జాతీయ పురస్కారాన్ని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖ సాహితీ వేత్తలు మొండెపు ప్రసాద్, మంగారి రాజేందర్, సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బి. ఆంజనేయరాజు ప్రదానం చేశారు.

మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం



దివీస్ కంపెనీ ప్రతినిధులతో కలిసి అమ్మవారి జల ప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

పెనుగంచిప్రోలు(వత్సవాయి): శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన దివీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు మినరల్ వాటర్ ప్లాంట్లను ఆదివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు తాగునీటి వసతి కల్పించేందుకు దివీస్ కంపెనీ వారు రూ.66 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారన్నారు. ఆలయ సిబ్బంది కూడా దాతలు అందించే సహకారాన్ని గుర్తించి ఆయా ప్లాంట్లను సజావుగా నిర్వహించాలని సూచించారు. రోజు అమ్మవారి దర్శించుకునే వేలాది భక్తులకు తాగునీటిని అందించేందుక దివీస్ కంపెనీ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. దివీస్ కంపెనీ సీఎండీ మురళీకృష్ణను సత్కరించి అమ్మవారి జ్ఞాపికతో పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, దివీస్ సిబ్బంది బి.కిశోర్‌కుమార్, గోపి, ఎస్.సాయికృష్ణ, సీహెచ్ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గజ్జి కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పేట గ్రంథాలయంలో వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



నందిగామలో మాట్లాడుతున్న ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి నాగుల్‌మీరా, సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అనుమంచిపల్లి జెడ్పీ హైస్కూల్ తెలుగు పండిట్ పి.ప్రేమలత పర్యవేక్షించారు. సాహితీ కార్యక్రమంలో భాగంగా సాహితీవేత్త డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాసరావు కాళిదాసు కవిత వైభవం అనే అంశంపై ప్రసంగించారు. కాళిదాసు బాల్య జీవితాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, కవులు, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, బత్తుల బ్రహ్మయ్య, అద్దంకి సుధాకర్, రాజు, విల్సన్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, మల్లిక, రమేష్, సత్యవతి, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు..

నందిగామటౌన్: ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా ప్రకృతిని కాపాడే బాధ్యత మనందరిపై అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నారాయణ ఆంగ్లో వేదిక్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో క్లిప్పింగ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాటకొండ కోటేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పేట గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

పుస్తకాలు మంచి నేస్తాలని పుస్తక పఠనంపై ప్రతి ఒక్కరు ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి నాగుల్‌మీరా సూచించారు. స్థానిక గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాయితీపై పుస్తకాలు విక్రయిస్తున్నామని, ఈ అవకాశాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యులు పారేపల్లి సత్యనారాయణ, అర్లప్ప, రాటకొండ సుభాకర్, రామకృష్ణ, ఖుద్దూస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో పాడి పరిశ్రమ

- తగ్గిన పాల దిగుబడులు
- వరదలకు దెబ్బతిన్న వరి పొలాలు
- వేధిస్తున్న పశుగ్రాస కొరత



గేదెలను మేతకు తోలుకెళ్తున్న పశుపోషకులు

వత్సవాయి: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను కూడా కొనసాగించడ ఆనవాయితీ. ప్రతి ఒక్కరి ఇంట్లో రెండు నుంచి మూడు పాడిగేదెలు ఉండేవి. ఇంట్లోని మహిళలు పాడిచేయడం ద్వారా వచ్చే ఆదాయం నెలవారీ కుటుంబఖర్చులకు సరిపోయేవి. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం పాడి గేదెలు కనుమరుగవుతున్నాయి. దీంతో పాడి పరిశ్రమ సంక్షోభంలో పడింది. రేయింబవళ్లు కష్టపడి పాడిగేదెలను పోషిస్తే కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయంలో నష్టాలు వచ్చినా పాడి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్న వారు కూడా నేడు పాడి చేయాలంటే భయపడుతున్నారు. పశుగ్రాసం కొరత కూడా ప్రధాన సమస్యగా మారింది. యంత్రాలతో వరిని కోయిస్తుండటంతో వరిగడ్డి పనికిరాకుండా పోతోంది. దీంతో పశుగ్రాసానికి కూడా గతంలో ఎన్నడూలేని కొరత ఏర్పడింది.

పెరిగిన ఖర్చులు...

పశుపోషకులకు ఖర్చులు పెరిగిపోయాయి. గతంలో 50 కేజీల తవుడు రూ.700 ఉండగా నేడు రూ.1200 నుంచి 1500 వరకు ధర పలుకుతోంది. ఇక మినప, పెసర, బొబ్బర్ల పొట్టు ధరలు కూడా పెరిగాయి. కొబ్బరిచెక్క కిలో రూ.80 వరకు ఉంది. ఎకరం పొలంలో పండిన వరిగడ్డి రూ.5వేలు ఉండగా నేడు 10వేలకు చేరింది. ఇటీవల మునేరు, పాలేరుకు సంభవించిన వరదల కారణంగా వరి పొలాలు భారీస్థాయిలో దెబ్బతినడంతో వరిగడ్డి దిగుబడి కూడా తగ్గిపోయింది. దీంతో ఒక గేదెకు పెట్టే పెట్టుబడి కూడా తిరిగి దక్కే పరిస్థితులు లేవని పశుపోషకులు చెబుతున్నారు. అయితే పాల కేంద్రాల నిర్వాహకులు పోషకులు వద్ద నుంచి లీటరు పాలును రూ.50కి కొనుగోలు చేసి రూ.80 వరకు అమ్ముతుండటం గమనార్హం.

గిట్టుబాటు కాని పాల ధర...

వత్సవాయి మండలంలో పాడిపశువుల సంఖ్య ప్రస్తుతం 12వేలకు ఉంటుందని ఓ అంచనా. గత కొన్ని దశాబ్దాలుగా పశుపోషకుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. దీంతో పశుసంపద కూడా ఏటా తగ్గిపోతోంది. అదేవిధంగా అనేక వ్యయప్రయాసల కోర్చి పశువులను పోషించినా పాల ధర కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. పాలలో వెన్న శాతం 10 పాయింట్లు ఉంటేనే లీటరు రూ.50 ఇస్తున్నారు. కొందరు పాలకేంద్రాల నిర్వాహకులు కూడా పాలలో వెన్న శాతం 6 నుంచి 7 పాయింట్ల వరకు చూపుతూ లీటర్‌కు రూ.30 నుంచి రూ.35 చొప్పున ఇస్తూ పాడిరైతులను మాయ చేస్తున్నారు. కొంతమంది పశుపోషకులకు కేంద్రాల నిర్వాహకులు ముందుగా కొంత నగదు పెట్టుబడి పెట్టి తమకు ఇష్టం వచ్చిన ధరలకు పాలు జమచేసుకుంటున్నారు. కొన్ని డైయిరీల వాళ్లు లీటర్‌కు రూ.2 నుంచి రూ.3 వరకు బోనస్ చెల్లిస్తుండగా మరికొన్ని డైయిరీల వాళ్లు రైతులకు రూపాయి కూడా ఇవ్వడంలేదని చెబుతున్నారు.



గేదె నుంచి పాలు పితుకుతున్న మహిళ

గిట్టుబాటు కావడం లేదు..



పశుపోషకులకు ప్రస్తుతం గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయి. పెరిగిన దాణా పశుగ్రాసం ఖర్చులకు తోడు పాలకు సరైన గిట్టుబాటు ధర లేకుండాపోయింది. పెయ్యి దూడలు పుడితే వాటిని నాలుగేళ్ల వరకు పెంచి అమ్ముకుంటే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది.

–ఎం రంగయ్య, వేమవరం

లాభాలు తగ్గాయి..



ప్రస్తుతం పాడి చేస్తున్న వారికి లాభం ఉండటం లేదు. పశుపోషణకు పెట్టుబడి ఎక్కువవుతోంది. వ్యవసాయం చేస్తున్న కొద్ది రైతులు మాత్రమే వ్యవసాయంతోపాటు పాడి పశువులు పెంచగలుగుతున్నారు. రానున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా పాలప్యాకెట్లు కొనుగోలు చేయక తప్పని పరిస్థితులు నెలకొంటాయి.

–ఎస్.లక్ష్మీనారాయణ, మక్కపేట

నిత్యావసరాలు పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో వరద ముంపుకు గురైన బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి, వీఆర్కే నగర మహిళ లయన్స్ క్లబ్ వారు సంయుక్తంగా 50 మంది బాధితులకు నిత్యావసర సరుకుల కిట్‌ను ఆదివారం పంపిణీ చేశారు. లయన్ దేవినేని జోనికుమారి, దేవినేని కిశోర్ కుమార్, నేపా సత్యనారాయణ, వెనిగళ్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలంలోని నరసింహారావు పాలెంలో ఓ వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించి మద్యం విక్రయించినా, అక్రమంగా మద్యాన్ని తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.